సాక్షి
పశ్చిమగోదావరి

మంగళవారం ׀ 31 ׀ డిసెంబర్ ׀ 2024



కొలిక్కిరాని బడ్జెట్ కసరత్తు

మున్సిపాలిటీల్లో బడ్జెట్ రూపకల్పన ఆలస్యమయ్యే అవకాశం ఉంది. నూతన ఎమ్మెల్యేల ఒత్తిడి కారణంగా కనిపిస్తోంది. 8లో



గంజాయిపై ఉక్కుపాదం

నేరాల నియంత్రణపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయని డీఐజీ అశోక్‌కుమార్ అన్నారు. 8లో



స్విమ్మింగ్‌లో ప్రతిభ

జాతీయ సౌత్‌జోన్ స్విమ్మింగ్ పోటీల్లో ఏలూరు జిల్లాకు చెందిన బలగ స్వామి నాయుడు ప్రతిభ చూపాడు. 8లో

బేరాల్లేవు..!

క్రిస్మస్.. న్యూ ఇయర్.. సంక్రాంతి వినియోగదారులతో నెల రోజుల పాటు కళకళలాడే మార్కెట్లలో ఈ ఏడాది పండుగ జోష్ కనిపించడం లేదు. ఇప్పటికే క్రిస్మస్ సేల్స్ సగానికి పైగా పడిపోగా కొత్త ఏడాది అమ్మకాలకూ అదే పరిస్థితి. భారీగా ఆఫర్లు ప్రకటిస్తున్నా అమ్మకాలు లేక దుకాణాలు వెలవెలబోతున్నాయి. గతంలో ఎన్నడూ ఇంతటి గడ్డు పరిస్థితి చూడలేదని వ్యాపార వర్గాలు అంటున్నాయి.

– సాక్షి, భీమవరం



తాడేపల్లిగూడెంలోని ఓ షోరూంలో పరిస్థితి

దుకాణాలు వెలవెల..
వ్యాపారులు విలవిల

- మార్కెట్‌లో కనిపించని న్యూ ఇయర్ జోష్
- అమ్మకాలు లేక బోసిపోయిన మార్కెట్లు
- ఇప్పటికే కళ తప్పిన క్రిస్మస్ సేల్స్
- సగానికి పైగా పడిపోయిన విక్రయాలు
- ఇంత గడ్డు పరిస్థితి ఎన్నడూ లేదంటున్న వ్యాపారులు
- సంక్రాంతి వ్యాపారం పైనే ఆశలు


భీమవరంలో ఖాళీగా ఉన్న రెడీమేడ్ షాపు


తణుకులో వెలవెలబోతున్న వేల్పూరు రోడ్డు

సాధారణంగా క్రిస్మస్ మొదలు సంక్రాంతి పండుగ వరకూ రెడీమేడ్, ఫ్యాన్సీ, కిరాణా, బంగారం వ్యాపారాలు భారీగా జరుగుతాయి. ఆయా పండుగల కోసం నెలరోజుల ముందుగానే వ్యాపారులు ముంబై, కోల్‌కతా, ఢిల్లీ తదితర నగరాల నుంచి భారీ మొత్తంలో లేటెస్ట్ మోడల్స్ ఖరీదు చేసి సరకు సిద్ధం చేసుకుంటారు. చిన్న వ్యాపారులు సైతం రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు సరకు నిల్వ పెట్టుకుంటారు. జిల్లాలో భీమవరం, పాలకొల్లు, తణుకు, తాడేపల్లిగూడెం వస్త్ర వ్యాపారానికి, నరసాపురం బంగారం వ్యాపారానికి పేరొందాయి. గతంలో రోజుకు జిల్లాలో సగటున రూ.5 కోట్ల వరకు వస్త్ర వ్యాపారం జరిగితే, రూ.6 కోట్ల రూ.8 కోట్ల వరకు బంగారం, రూ.5 కోట్లకు పైగా కిరాణ అమ్మకాలు జరిగేవి. క్రిస్మస్, న్యూ ఇయర్, సంక్రాంతి రోజుల్లో రెట్టింపు స్థాయిలో వ్యాపారం జరిగేది.

రోజువారీ వ్యాపారం కూడా లేదు

ప్రస్తుతం మార్కెట్‌లో ఎక్కడా పండుగ శోభ కనిపించడం లేదు. చిన్నపాటి దుకాణాలతో పాటు మాల్స్, షోరూంలలో అమ్మకాలు తగ్గిపోయాయి. ఇప్పటికే క్రిస్మస్ అమ్మకాలు సగానికి పైగా పడిపోయాయని వ్యాపార వర్గాలు అంటున్నాయి. ఇప్పుడు కొత్త ఏడాది వేడుకలకు అదే పరిస్థితి కనిపిస్తోంది. జిల్లాలో వ్యాపార కేంద్రాలుగా ప్రసిద్ధి చెందిన భీమవరంలోని జువ్వలపాలెం రోడ్డు, మల్టీప్లెక్స్ ఏరియా, డీఎన్ఆర్ కళాశాల రోడ్డు, నాచు వారి సెంటర్, ఆదివారం బజార్, నరసాపురంలోని స్టీమర్ రోడ్డు, తణుకులోని వేల్పూరు రోడ్డు, రాష్ట్రపతి రోడ్డు, పాలకొల్లులోని బస్టాండ్ సెంటర్, తాడేపల్లిగూడెం వన్‌టౌన్‌లోని కేఎన్ రోడ్డు, తాలుకా ఆఫీస్ రోడ్లు వినియోగదారులు లేక వెలవెలబోతున్నాయి. మాల్స్‌లో ఓ మోస్తరు వ్యాపారం జరుగుతుండగా మామూలు దుకాణాల్లో రోజువారీ వ్యాపారం కూడా జరగడం లేదు. కొద్ది నెలలుగా వ్యాపారం తగ్గిపోవడంతో ఈసారి అంతంతమాత్రంగానే స్టాకులు తెచ్చినా అవి కూడా అమ్ముడుపోని పరిస్థితి కనిపిస్తోందని వ్యాపారులు అంటున్నారు. కస్టమర్లను ఆకర్షించేందుకు భారీగా ఆఫర్లు ప్రకటిస్తున్నా అమ్మకాలు నామమాత్రంగానే ఉంటున్నాయని, గతంలో ఎప్పుడూ ఇటువంటి పరిస్థితి చూడలేదని వ్యాపారులు వాపోతున్నారు.

మార్కెట్లు డల్

కొద్ది నెలలుగా మార్కెట్లు డల్ అయిపోయాయి. గత ప్రభుత్వంలో ప్రతినెలా పథకాలు పేద వర్గాలకు తలుపు తట్టేవి. కూటమి పాలనలో సంక్షేమం జాడ లేకుండా పోయింది. నెలల తరబడి ఇసుక కొరతతో నిర్మాణ రంగం సంక్షోభంలో కూరుకుపోయింది. జిల్లాలో అధిక సంఖ్యలో ఉన్న భవన నిర్మాణ కార్మికులు పనుల్లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడాల్సి వచ్చింది. చేతిలో చిల్లిగవ్వ లేక కుటుంబ పోషణ కోసం అయినకాడికి అప్పులు చేస్తున్న పరిస్థితి. మరో పక్క అడ్డూఅదుపూ లేకుండా పెరుగుతున్న నిత్యావసర సరకులు, కూరగాయల ధరలు వారి జీవన ప్రమాణాలను మరింత దుర్భరంగా మార్చేశాయి.

పెద్ద పండుగపైనే ఆశలు

సంక్రాంతి పండుగలకు జిల్లా పెట్టింది పేరు కావడంతో ఇప్పుడు వ్యాపారుల ఆశలన్నీ పెద్ద పండుగపైనే ఉన్నాయి. అమ్మకాలు ఆశించిన స్థాయిలో జరగకుంటే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందంటున్నారు.

ప్రత్యేక స్టాళ్లకు వెనుకడుగు

డిసెంబరు 31న రెస్టారెంట్లు, హోటళ్లతో పాటు పట్టణం, పల్లె అనే తేడా లేకుండా వీధివీధినా వ్యాపారులు ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేస్తుంటారు. న్యూ ఇయర్ స్పెషల్ ఫ్యామిలీ ప్యాక్, స్పెషల్ ప్యాక్, కాంబో అంటూ ఆకర్షణీయమైన ఆఫర్లతో పెద్ద ఎత్తున బిర్యానీ, చికెన్ వెరైటీలు, సీఫుడ్ అమ్మకాలు చేస్తుంటారు. ప్రస్తుత పరిస్థితుల్లో అమ్మకాలు జరుగుతాయో లేదోనన్న అనుమానంతో స్టాళ్ల ఏర్పాటుకు వెనుకడుగేస్తున్నట్టు వ్యాపారులు చెబుతున్నారు.

“ గడ్డు పరిస్థితులు



గత పదేళ్లుగా రెడీమేడ్ వ్యాపారం చేస్తున్నాను. కోవిడ్ సమయంలో కూడా ఇంత గడ్డు పరిస్థితిని చూడలేదు. ఈ ఏడాది పండుగ సీజన్‌లోనూ అమ్మకాలు లేక మార్కెట్ చాలా డల్‌గా ఉంటోంది.

– జల్లూరి జగదీష్, రెడీమేడ్ వ్యాపారి, తణుకు

చిరు వ్యాపారులకు ఇబ్బంది



వ్యాపారాలు సాగక చిన్న వ్యాపారులు ఇబ్బంది పడుతున్నారు. ధరలు పెరిగిపోవడం, ఆన్‌లైన్ వ్యాపారం బాగా దెబ్బతీస్తున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే వ్యాపారులు రోడ్డున పడతారు.

– సనిశెట్టి లీలా భవన్నారాయణ, కిరాణా అసోసియేషన్ ప్రెసిడెంట్, పాలకొల్లు

ఆఫర్ల మీద నడుపుతూ..



ప్రతి ఏడాది క్రిస్మస్, న్యూ ఇయర్, సంక్రాంతికి వ్యాపారం బాగా జరిగేది. ఈ ఏడాది వ్యాపారాలు చాలా డల్‌గా నడుస్తున్నాయి. బ్రాండెడ్ దుస్తులు సైతం ఆఫర్లు పెట్టి అమ్మకోవాల్సి వస్తోంది.

– పి.కిషోర్, లిబ్రా ఫ్యాషన్, భీమవరం

న్యూస్‌రీల్

గడువులోపు అర్జీలు పరిష్కరించాలి


బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ నయీం అస్మి

భీమవరం: ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తూ అర్జీలు పునరావృతం కాకుండా నిర్దీత గడువులోపు పరిష్కరించాలని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం భీమవరం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటుచేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతులు స్వీకరించారు. బాధితుల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, అత్తింటి వేధింపులు, భూ, ఆస్తి వివాదాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీలు, ఆన్‌లైన్ మోసం, ప్రేమ పేరుతో వంచన, ఆస్తి తగాదాలకు సంబంధించి ఎనిమిది అర్జీలను ఎస్పీ స్వీకరించారు. జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) వి.భీమారావు, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి.పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

యోగాలో ట్రిపుల్ ఐటీ విద్యార్థి ప్రతిభ


దుర్గాప్రసాద్‌ను అభినందిస్తున్న దృశ్యం

నూజివీడు: భువనేశ్వర్‌లోని కిట్ యూనివర్సిటీలో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి అంతర్ విశ్వవిద్యాలయాల యోగాసన పోటీల్లో నూజివీడు ట్రిపుల్ ఐటీ విద్యార్థి ప్రతిభ కనబరిచాడు. రిథమిక్ యోగాలో ఇంజనీరింగ్ ఫస్టియర్ విద్యార్థి టి.దుర్గాప్రసాద్ తృతీయ స్థానం సాధించి కాంస్య పతకాన్ని గెలుచుకున్నాడు. విద్యార్థిని డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్, ఏఓ బి.లక్ష్మణరావు తదితరులు అభినందించారు.

ఐఆర్‌సీటీసీ మహా కుంభ పుణ్యక్షేత్ర యాత్ర

ఏలూరు (టూటౌన్): ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో జనవరి 19 నుంచి మహా కుంభ పుణ్యక్షేత్ర యాత్ర ప్రారంభించనున్నట్టు రైల్వే విజయవాడ ఏరియా మేనేజర్ ఎం.రాజా ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్‌లో జనవరి 19న రైలు బయలుదేరి విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, తుని మీదుగా ప్రయాణిస్తుందని పేర్కొన్నారు. యాత్రలో భాగంగా వారణాశి, అయోధ్య, హనుమాన్ గర్హి, ఆరతి, ప్రయాగ్ రాజ్ వంటి క్షేత్రాలు సందర్శించవచ్చన్నారు. యాత్ర ఏడు రాత్రులు, ఎనిమిది పగళ్లు ఉంటుందని తెలిపారు. స్లీపర్ క్లాస్‌లో పెద్దలకు రూ.22,635, పిల్లలకు రూ.21,740 స్టాండర్డ్ క్లాస్ టికెట్ ధర పెద్దలకు రూ.31,145, పిల్లలకు రూ.30,095, కంఫర్ట్ క్లాస్ టికెట్ ధర పెద్దలకు రూ.38,195, పిల్లలకు రూ.36,935గా నిర్ణయించామని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ 92814 95848, 8977314121 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

ముగిసిన సర్టిఫికెట్ల పరిశీలన

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఏలూరు నగర పాలక సంస్థతో పాటు ఏడు మున్సిపాలిటీల్లో 2017లో క్వాలిఫై అయిన తెలుగు, హిందీ స్పెషల్ గ్రేడ్ టీచర్లకు పదోన్నతుల నిమిత్తం అర్హులైన వారి సర్టిఫికెట్ల పరిశీలన సోమవారం ముగిసింది. అర్హులైన ఎస్‌జీటీల జాబితాను ఇటీవల డీఈఓ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. ఏలూరు నగర పాలక సంస్థ యూనిట్‌గా తెలుగు ఎస్‌జీటీలు 16 మంది, మిగిలిన ఏడు మున్సిపాలిటీల్లోని 29 మంది సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరయ్యారు. అలాగే హిందీ ఎస్‌జీటీల్లో ఏలూరు నగరపాలక సంస్థ యూనిట్ నుంచి ఆరుగురు, మిగిలిన ఏడు మున్సిపాలిటీల నుంచి తొమ్మిది మంది హాజరయ్యారు.

42,602 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు

ఏలూరు (మెట్రో): తూర్పు, పశ్చిమ, కృష్ణా, గుంటూరు జిల్లాల పరిధిలోని గ్రాడ్యుయేట్ ఓటర్ల తుది జాబితాను సోమవారం అధికారులు విడుదల చేశారు. ఏలూరు జిల్లాలోని 62 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటర్ల జాబితాను ప్రకటించారు. జిల్లాలో 24,895 పురుష, 17,699 మహిళా గ్రాడ్యుయేట్లు ఉన్నారు. ఇతరులు ఎనిమిది మంది ఉండగా మొత్తంగా 42,602 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నారు.

దత్తతకు అనుమతి తప్పనిసరి


సమీక్షిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): అనుమతి లేని పిల్లల దత్తతను ఉపేక్షించబోమని జిల్లా కలెక్టర్ సీహెచ్ నాగరాణి హెచ్చరించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో ఆమె అధ్యక్షతన మిషన్ వాత్సల్య, మిషన్ శక్తి కార్యక్రమాల కన్వర్జెన్సీ సమావేశాన్ని నిర్వహించారు. దత్తతకు జిల్లాలో ఆరు దరఖాస్తులే అందడంపై ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. పిల్లలు కలగరు అనే దంపతులకు అవగాహన కల్పించి దరఖాస్తులను స్వీకరించాలని సూచించారు. బాల్యవివాహాలను నిరోధించాలన్నారు. మూడో అడిషనల్ జిల్లా జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ ఎంఏ సోమశేఖర్ మాట్లాడుతూ మహిళలు, చిన్నారులపై అకృత్యాలను నిరోధించడం సామాజిక బాధ్యత అని, అధికారులంతా సమష్టిగా కృషిచేయాలన్నారు.

ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి చర్యలు

జిల్లాలో ఎస్సీ, ఎస్టీ వర్గాల అభ్యున్నతికి చర్యలు చేపట్టినట్టు కలెక్టర్ నాగరాణి తెలిపారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టంపై జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. గరగపర్రు బస్టాండ్ పక్కన ఏర్పాటుచేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని పరిశీలించి నివేదిక అందించాలని ఆర్డీఓను ఆదేశించారు. అలాగే మ్యాన్యువల్ స్కావెంజర్ నిషేధ, పునరావాస చట్టానికి సంబంధించిన విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు.

నిబంధనలు మీరితే ఉపేక్షించం

జిల్లా ఎస్పీ నయీం అస్మి

భీమవరం : నూతన సంవత్సర వేడుకల సందర్భంగా అసాంఘిక, అనుచిత, అనుమతులు లేని కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ జిల్లా అద్నాన్ నయీం అస్మి హెచ్చరించారు. ప్రజలంతా బాధ్యతాయుతంగా వేడుకలు జరుపుకోవాలని సూచించారు. బహిరంగ ప్రదేశాలు, రోడ్డు కూడళ్లలో ఎక్కువ మంది గుమిగూడటం, బహిరంగంగా పార్టీలు, భారీ శబ్దాలతో లౌడ్ స్పీకర్లు, డీజేలు పెట్టడం నిషేధమన్నారు. ద్విచక్ర వాహనాలకు సైలెన్సర్ తీసేసి ర్యాష్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, బైక్, కార్ రేసింగ్ చేసే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. వేడుకల పేరుతో రౌడీయిజం చేసినా, దురుసుగా ప్రవర్తించినా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా, మద్యం మత్తులో డ్రైవ్ చేసినా, ప్రజారవాణాకు అడ్డంకులు సృష్టించేలా వాహనాలు నడపినా ఉపేక్షించబోమన్నారు.



డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక దృష్టి

వైన్ షాపులు, బార్లు, రెస్టారెంట్లు, దాబాలు, ఇతర అవుట్‌లెట్లు, వ్యాపార సముదాయాలు నిర్దేశిత సమయంలో మూసివేయాలని ఎస్పీ స్పష్టం చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టామని, పట్టుబడిన వ్యక్తులపై కేసు నమోదు చేసి వాహనాలను సైతం సీజ్ చేస్తామన్నారు. జిలావ్యాప్తంగా డీఎస్పీల పర్యవేక్షణలో అన్ని ముఖ్య కూడళ్లలో మంగళవారం సాయంత్రం నుంచి పోలీస్ పికెట్స్, నైట్ గస్తీ బృందాలను ఏర్పాటుచేస్తున్నామన్నారు. నిరంతర నిఘా ఉంటుందని, వాహన తనిఖీలు చేపడతామని చెప్పారు. ప్రజలు శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా వ్యవహరించాలని ఎస్పీ కోరారు.

సిరుల తల్లి.. వరాల కల్పవల్లి

కొంగు బంగారం

- మావుళ్లమ్మ ఉత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు
- జనవరి 13 నుంచి నెల పాటు నిర్వహణ
- ప్రత్యేక పూజలు, కళా ప్రదర్శనలు
- రూ.90 లక్షలతో జాతర మహోత్సవాలు


మావుళ్లమ్మవారు


ఆలయం వద్ద చలువ పందిళ్లు


భారీ సెట్టింగ్‌లకు ఏర్పాట్లు

భీమవరం(ప్రకాశం చౌక్): భక్తుల పాలిట కొంగు బంగారం.. భీమవరం ఇలవేల్పు మావుళ్లమ్మవారి 61వ వార్షిక మహోత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. నీరుల్లి కూరగాయ, పండ్ల వర్తక సంఘం ఆధ్వర్యంలో దేవస్థానం సహకారంతో జనవరి 13 నుంచి ఫిబ్రవరి 14 వరకు జాతర మహోత్సవాలు నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా ఇప్పటికే అమ్మవారి అలంకరణ పనులు పూర్తయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ఆలయం వద్ద చలువ పందిళ్లు, భారీ సెట్టింగ్‌ల కోసం విద్యుత్ దీపాలంకరణ, క్యూలైన్ తదితర ఏర్పాట్లు జరుగుతున్నాయి.

నిలువెత్తు స్వర్ణమయం

మావుళ్లమ్మవారిని నిలువెత్తు స్వర్ణమయం చేయడానికి దాతలు, భక్తుల నుంచి బంగారాన్ని సేకరిస్తున్నారు. ఇప్పటివరకు 72 కిలోల బంగారం సేకరించగా 63 కిలోల వరకూ ఆభరణాలు తయారు చేసి అమ్మవారికి అలంకరించారు. 100 కిలోలు బంగారు ఆభరణాలను అమ్మవారికి అలంకరించాలనే లక్ష్యంగా ఆలయ అధికారులు, ఉత్సవ నిర్వాహకులు దాతలను ప్రోత్సహిస్తున్నారు.

రూ.90 లక్షల వ్యయంతో..

నీరుల్లి కూరగాయ పండ్ల వర్తక సంఘం ఆధ్వర్యంలో దాదాపు రూ.80 లక్షల నుంచి రూ.90 లక్షలతో ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఉత్సవాల ఆఖరి తొమ్మిది రోజులపాటు అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేస్తారు. రోజూ సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు జానపద, భరత నాట్య ప్రదర్శనలు, హరికథ, బుర్రకథ వంటి కళాప్రదర్శనలు, సినీ సంగీత విభావలు ఏర్పాటుచేస్తారు. సుమారు 30 నాటకాలు, 20 హరికథ, బుర్రకథలు, 15 వరకూ సినీసంగీత విభావరి కార్యక్రమాలు ఉంటాయి. ఇలా కళారంగాన్ని ప్రోత్సహిస్తున్నారు.

భారీగా భక్తుల రాక

అమ్మవారి ఉత్సవాలను తిలకించేందుకు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు వస్తుంటారు. దీంతో నెలరోజుల పాటు ఆలయం వద్ద జన సందడి నెలకొంటుంది. ఆలయం వద్ద సెట్టింగ్‌లు, విద్యుత్ అలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి.

లక్షల మందికి అన్నదానం

ఆలయం వద్ద నెల రోజులపాటు భక్తులకు ఉచిత అన్నదానం నిర్వహిస్తారు. రోజుకు సుమారు 7 వేల మంది అన్నప్రసాదాన్ని స్వీకరిస్తారు. అలాగే ఆఖరి రోజు మహా అన్నదానం నిర్వహిస్తారు. సుమారు లక్ష మందికి అన్నప్రసాదాన్ని అందిస్తారు. అమ్మవారి అన్న ప్రసాదం స్వీకరించడాన్ని జిల్లా ప్రజలు సెంటిమెంట్‌గా భావిస్తారు.

60 ఏళ్లుగా ఉత్సవాలు

గత 60 ఏళ్లుగా నీరుల్లి కూరగాయ, పండ్ల వర్తక సంఘం ఆధ్వర్యంలో దేవస్థానం సహకారంతో ఉత్సవాలను విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఉభయగోదావరి జిల్లాల్లో నెల రోజులపాటు నిర్వహించే ఏకై క ఉత్సవంగా మావుళ్లమ్మ ఉత్సవాలు నిలుస్తున్నాయి. గతంలో ఉత్సవాల్లో భాగంగా సినీ, కళారంగ ప్రముఖులను సన్మానించి బంగారాన్ని బహూకరించేవారు. కరోనా విపత్తు సమయం నుంచి సన్మాన కార్యక్రమాలను నిలిపివేశారు.



లాంగ్ జంప్‌లో సత్తాచాటుతూ..

ఉద్యోగమే లక్ష్యంగా..

కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు

ఏలూరు టౌన్: ఏపీ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చేపట్టిన కానిస్టేబుళ్ల నియామక ప్రక్రియ ప్రారంభమైంది. రెండేళ్ల క్రితం ప్రాథమిక ఎంపిక రాత పరీక్షలు పూర్తి కాగా... తాజాగా దేహదారుఢ్య పరీక్షలను చేపట్టారు. ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో సోమవారం తొలిరోజు దేహదారుఢ్య పరీక్షలకు భారీ సంఖ్యలో అభ్యర్థులు హాజరై ప్రతిభను చాటారు. ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ ఉదయం నుంచి గ్రౌండ్స్‌లోనే ఉంటూ పోటీలను పర్యవేక్షించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలో 600 మంది పురుష అభ్యర్థులకు హాల్‌టికెట్లు జారీ చేయగా 309 మంది హాజరయ్యారు. వీరిలో 179 మంది ఎంపికైనట్టు జిల్లా ఎస్పీ తెలిపారు. అభ్యర్థులు తప్పనిసరిగా ఒరిజినల్, జిరాక్స్ సర్టిఫికెట్లతో రావాలని సూచించారు. జనవరి 9 వరకు ఫిజికల్ టెస్టులు నిర్వహిస్తామన్నారు. అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు పర్యవేక్షించారు.


పరుగు పోటీలో..


అభ్యర్థి ఛాతీ కొలతలు తీస్తూ..


ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో అభ్యర్థులకు సూచనలు ఇస్తున్న ఎస్పీ ప్రతాప్ శివకిషోర్


అభ్యర్థుల ఎత్తు కొలతలు తీసుకుంటూ..

కొలిక్కిరాని బడ్జెట్ కసరత్తు

- మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ప్రత్యేకాధికారులపైనే భారం
- బడ్జెట్ రూపకల్పనపై కొత్త ఎమ్మెల్యేల ఒత్తిడి
- ఈ ఏడాది కూడా ఆలస్యమయ్యే అవకాశం

నరసాపురం: 2023–24 ఆర్థిక సంవత్సరం మరో మూడు నెలల్లో ముగియనుంది. ఈ నేపథ్యంలో పలు ప్రభుత్వ శాఖలు తమ పరిధిలో కొత్త ఆర్థిక సంవత్సర బడ్జెట్ రూపకల్పనలో నిమగ్నమవుతాయి. ఇందులో మున్సిపల్ పరిపాలన శాఖ అత్యంత కీలకమైంది. మున్సిపల్ నిబంధనల ప్రకారం ఏటా డిసెంబర్ నెలాఖరుకు ఉమ్మడి పశ్చిమలోని ఏలూరు కార్పొరేషన్‌తో సహా మిగిలిన మున్సిపాలిటీలు, నగర పంచాయతీలోల్ 2024–25 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ ముసాయిదా పూర్తిచేసి కలెక్టర్‌కు సమర్పించాలి. కలెక్టర్ పరిశీలన అనంతరం ఆ బడ్జెట్ ముసాయిదాలపై ఆయా పురపాలక సంఘాల పాలకవర్గాలు చర్చించి నిధుల కేటాయింపులో అవసరమైన మార్పులు, చేర్పులు చేపడతాయి. డిసెంబర్ నెలాఖరుకు ఎట్టి పరిస్థితుల్లోను బడ్జెట్ ముసాయిదాలు సమర్పిస్తే వెంటనే కలెక్టర్ పరిశీలనకు పంపి ఆపై ఆయా మున్సిపాలిటీలకు పంపుతామని మున్సిపల్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం నుంచి మూడు నెలల క్రితమే ఆదేశాలు, సూచనలు జారీ చేసింది. అయితే ఇంకా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో బడ్జెట్ రూపకల్పన పూర్తి కాలేదు. కొత్త ఎమ్మెల్యేల ఒత్తిడితో ఈ ఏడాది బడ్జెట్ రూపకల్పన ఆలస్యమయ్యే అవకాశముంది.



నరసాపురం మున్సిపల్ కార్యాలయ భవనం(ఫైల్)

గతేడాదీ ఆలస్యమే

గత ఏడాది కూడా డిసెంబర్ నెలాఖరుకు బడ్జెట్ ముసాయిదాలు రూపొందించాలని మున్సిపల్ పాలక వర్గాలకు, ప్రత్యేక అధికారులకు సూచించారు. గత ఏడాది జిల్లాలోని చాలా మున్సిపాలిటీలు జనవరి నెలాఖరుకు ముసాయిదాలు సమర్పించాయి. ఎన్నికల నేపథ్యంలో ఆలస్యమైందని సదరు మున్సిపాలిటీలు వివరణ ఇచ్చాయి. ఈ ఏడాది కూడా ఉమ్మడి జిల్లాలో అదే తంతు జరుగుతోంది.

ప్రత్యేక అధికారులదే తుది నిర్ణయం

ఈ ఏడాది మున్సిపాలిటీల పరిపాలన ముఖచిత్రం పూర్తిగా మారింది. ప్రస్తుతం పశ్చిమగోదావరిజిల్లాలో ప్రధాన మున్సిపాలిటీలు స్పెషల్ ఆఫీసర్ల పాలనలో ఉన్నాయి. దీంతో 2024–25 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ ముసాయిదాలు రూపొందించాల్సిన పూర్తి బాధ్యత ఆయా మున్సిపాలిటీల ప్రత్యేక అధికారులపైనే ఉంది. పశ్చిమలో భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, పాలకొల్లు మున్సిపాలిటీలకు ఎన్నికలు జరగని కారణంగా ప్రత్యేక అధికారుల పాలనలో ఉన్నాయి. మునిసిపాలిటీల్లో ఇప్పటికి బడ్జెట్ ముసాయిదా రూపకల్పన ఇంకా ఓ కొలిక్కి రాలేదు. తుదిగడువు డిసెంబర్ నెలాఖరు ముగుస్తోంది. ఈ నేపథ్యంలో నిర్దీత గడువు లోగా బడ్జెట్ ముసాయిదాలు రూపొందించి కలెక్టర్ అనుమతికి పంపలేదు. జనవరి నెలాఖరుకు కూడా ఈ తంతు ముగిసేలా కనిపించడంలేదు.

తూతూమంత్రంగా రూపకల్పన

ఏటా కొత్త బడ్జెట్ రూపకల్పన కేవలం తూతూ మంత్రంగా సాగుతోందని, గడిచిన ఆర్థిక సంవత్సర కేటాయింపులు పది శాతానికి పెంచి కొత్త బడ్జెట్ రూపకల్పన చేస్తున్నారని, ఇది సరైన ప్రక్రియ కాదనే వాదన వినిపిస్తోంది. ప్రధాన మున్సిపాలిటీల్లో పాలకవర్గాల ప్రమేయం లేకుండా కేవలం ప్రత్యేకాధికారులే బడ్జెట్ ముసాయిదాలు రూపొందిస్తున్నారు. ఈ ముసాయిదాల్లో కేవలం అంకెల గారడీ కాకుండా అవసరమైన పనులకు నిధుల కేటాయింపు పెంచాలనే భావన ప్రజల్లో వినిపిస్తోంది. ఇదే సమయంలో బడ్జెట్ ముసాయిదాల రూపకల్పనలో ఆయా మున్సిపాలిటీల ప్రత్యేకాధికారులు, పాలకవర్గాలపైనా కొత్తగా ఎన్నికైన స్థానిక ఎమ్మెల్యేల ప్రభావం ఉంది. రాబోయే మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని తమ పరిధిలోని మునిసిపాలిటీల్లో ఏ ప్రాంతానికి, ఏ రంగానికి ఏ మేరకు నిధులు కేటాయించాలో వివరిస్తూ పలువురు ఎమ్మెల్యేలు అధికారులకు సూచనలు జారీ చేసినట్లు తెలిసింది. కొత్తగా ఏర్పడిన కూటమి సర్కార్ ఈ 6 నెలల కాలంలో మున్సిపాలిటీలకు ప్రత్యేకంగా ఎలాంటి నిధులు కేటాయింపులు చేయలేదు. ఈ పరిస్థితుల్లో బడ్జెట్‌లో అంకెల రూపకల్పన ఎలా అనే దానిపై అధికారులు తలలు పట్టుకుంటున్నారు. నిర్దీత గడువులోగా ముసాయిదాలు తయారు చేయలేకపోయిన అధికారులు జనవరిలోనైనా ముసాయిదాల ప్రతులు కలెక్టర్ అనుమతికి పంపుతారో.. లేదో పరిశీలించాల్సి ఉంది. ఇంత వరకు తమకు బడ్జెట్ ముసాయిదా అందలేదని రాజమండ్రిలోని మున్సిపల్ ఆర్‌డీడీ కార్యాలయ వర్గాలు చెబుతున్నాయి.

మా బడ్జెట్ తుది దశలో ఉంది



నరసాపురం మున్సిపాలిటీ బడ్జెట్ రూపకల్పన తుది దశలో ఉంది. వాస్తవానికి ఇప్పటికే బడ్జెట్ కౌన్సిల్ ఆమోదం జరగాలి. మేం దాదాపుగా పూర్తిచేశాం. పాలకవర్గాల నిర్ణయంపై ఆధారపడి నిర్ణయాలు ఉంటాయి, ఆలస్యానికి కారణాలు ఉంటాయి. 31న కౌన్సిల్ బడ్జెట్ సమావేశం ఏర్పాటు చేశారు. ఆమోదం జరిగిన వెంటనే ఉన్నతాధికారులకు, జిల్లా కలెక్టర్‌కు పంపిస్తాం.

– ఎం.అంజయ్య, నరసాపురం మున్సిపల్ కమిషనర్

క్లుప్తంగా

ఎస్సీ కులగణన ఆడిట్ గడువు పెంచాలి



కలెక్టర్ వెట్రిసెల్వికి వినతి పత్రం అందజేస్తున్న డాక్టర్ సంతోష్ కుమార్

ఏలూరు (టూటౌన్): ఎస్సీ కులగణన ఆడిట్ తేదీని ఈ నెల 31 నుంచి జనవరి 20 వరకు పెంచాలని కోరుతూ ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం, మాల సంఘాల ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వికి సోమవారం వినతిపత్రం అందజేశారు. డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో ఎస్సీ కులగణన ఆడిట్‌పై అభ్యంతరాలు తెలిపేందుకు వినతిని అందజేసారు. ఈ సందర్భంగా సంతోష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో ఎస్సీ-మాల కులస్తులు ఎక్కువని, సర్వేలో మాల స్థానంలో వేర్వేరు కులాలు రాశారన్నారు. దీన్ని సరిచేయాల్సిన బాధ్యత అధికారులదే అన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వలంటీర్లు చేసిన సర్వేను సోషల్ ఆడిట్‌లో పెట్టడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. వాలంటీర్లు చేసిన సర్వేను తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన వారిలో పల్లెం ప్రసాద్, నేతల రమేష్, దాసరి శ్యామ్ తదితరులు ఉన్నారు.

గంజాయిపై ఉక్కుపాదం



ఇరగవరం పోలీస్ స్టేషన్‌లో మాట్లాడుతున్న డీఐజీ

ఇరగవరం: నేరాల నియంత్రణపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయని డీఐజీ జీవీజీ ఆశోక్ కుమార్ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఇరగవరం పోలీస్ స్టేషన్‌ను ఆయన సోమవారం తనిఖీ చేశారు. పోలీస్ రికార్డులు పరిశీలించారు. గ్రామాలలో ప్రశాంత వాతావరణం కోసం పీస్ కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు పెట్టకుండా అప్రమత్తంగా ఉండాలని, వారిని గుర్తించి చట్టపరమైన కేసులు పెట్టాలన్నారు. జిల్లాలో సైబర్ క్రైం ఎక్కువగా జరుగుతుందని, సైబర్ నేరాలు అరికట్టేందుకు కృషి చేయాలన్నారు. భీమవరం, పాలకొల్లు, తాడేపల్లిగూడెం తదితర రైల్వే స్టేషన్ సమీప ప్రాంతాలలో గంజాయి విస్తరిస్తుందని చెప్పారు. గంజాయి సరఫరా చేస్తున్న వారిని గుర్తించి నిఘా పెట్టాలన్నారు. గంజాయి నిర్ధారణ జరిగితే టోల్‌ఫ్రీ నెంబర్ 14500 నెంబరు కాల్ చేయాలని సూచించారు. ఎస్పీ ఎ.నయీ అస్మీ, డీఎస్పీ డి.విశ్వనాథ్, సీఐ బి.కృష్ణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పరిజ్ఞానం సాయం తీసుకోవాలి

భీమవరం: కేసుల దర్యాప్తులో ఆధునిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని వేగవంతంగా కేసుల పరిష్కారానికి కృషి చేయాలని ఐజీ జీవీజీ అశోక్ కుమార్ అన్నారు. సోమవారం భీమవరం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, కేసుల నమోదు, దర్యాప్తు వంటి విషయాలపై ట్రాఫిక్ అధికారులకు సూచనలు చేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా అవగాహన కల్పించాలన్నారు.

మృతదేహం వెలికితీత

దెందులూరు: దెందులూరు శివారు అలుగులగూడెంలో ఈ నెల 4న అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన మద్దల చిన్న యేసు మృతదేహాన్ని సమాధి నుంచి వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించారు. దెందులూరు ఎస్సై ఆర్.శివాజీ తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన లిఖితపూర్వక ఫిర్యాదు మేరకు దెందులూరు ఎస్సై, తహసీల్దార్ బీ సుమతి, ఏలూరు వైద్యశాల ప్రొఫెసర్ సమక్షంలో మృతదేహాన్ని సమాధి నుంచి బయటకు తీశారు. అనంతరం మృతదేహం నుంచి పరీక్షలకు కావాల్సిన వాటిని ఏలూరు తీసుకెళ్లారు.

స్విమ్మింగ్ పోటీల్లో ప్రతిభ



స్వామినాయుడు, బి.భవానీ, రవికార్తీక్‌ను అభినందిస్తున్న కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): జాతీయ సౌత్ జోన్ స్విమ్మింగ్ పోటీల్లో ప్రతిభ చూపిన బలగ స్వామినాయుడును కలెక్టర్ కె.వెట్రిసెల్వి అభినందించారు. విజయవాడ లో ఈ నెల 27 నుంచి 29 వరకు నిర్వహించిన 35వ జాతీయ సౌత్ జోన్‌లో జిల్లాకు చెందిన బలగ స్వామినాయుడు 50 మీటర్ల బటర్ ఫ్లై విభాగంలో 3వ స్థానంలో నిలిచి కాంస్య పతకం కైవసం చేసుకున్నాడు. సోమవారం కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో డీఎస్‌డీవో బి.శ్రీనివాసరావుతో కలిసి స్వామినాయుడు కలెక్టర్‌ను కలవగా అభినందించి భవిష్యత్ మరిన్ని విజయాలు సాధించాలన్నారు. బుడిగిన భవానీ, రవి కార్తీక్ ఎజీ 4.200 మీటర్ల ఫ్రీ స్టైల్ రిలే విభాగంలో, 4.100 మీటర్ల ఫ్రీ స్టైల్ రిలే విభాగంలో ఆంధ్రప్రదేశ్ టీంకు ప్రాతినిధ్యం వహించారు. ఈ టీం 2వ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ ను కైవసం చేసుకోవడం ప్రసంశనీయమన్నారు. ఈ సందర్భంగా డీఎస్‌డీవో బి.శ్రీనివాసరావు, కోచ్ బి.గణేష్‌ను అభినందించారు.

ఉప్పరగూడెంలో రాష్ట్ర స్థాయి చెడుగుడు పోటీలు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఉప్పరగూడెం గ్రామంలో జనవరి 14, 15, 16వ తేదిల్లో రాష్ట్ర స్థాయి చెడుగుడు పోటీలు నిర్వహించనున్నట్టు అంబేడ్కర్ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి రూ.40 వేలు, ద్వితీయ బహుమతి రూ.35 వేలు, తృతీయ బహుమతి రూ.30 వేలు, నాలుగో బహుమతి రూ.10వేలు అందజేయనున్నట్లు వివరించారు. 14న మహిళలకు ముగ్గుల పోటీలు ఏర్పాటు చేశామని, విజేతలకు బహుమతులు అందిస్తామని తెలిపారు. ఆసక్తి గల టీంలు ముందుగా రూ.200 చెల్లించి, నమోదు చేసుకోవాలన్నారు. ఎలాంటి గడువు లేదన్నారు.

నాణ్యమైన పరిష్కారం చూపాలి



పీజీఆర్ఎస్‌లో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): ఆర్థిక పరమైన, కోర్టు కేసులకు సంబంధించిన వినతులు తప్ప మిగిలిన అన్నింటికి సరైన పరిష్కారాన్ని చూపాలని, ప్రతి వినతికి నాణ్యమైన సమాధానం ఇవ్వాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో కలెక్టర్ చదలవాడ నాగరాణి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సంబంధిత అధికారులతో కలిసి ఫిర్యాదుదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వినతుల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని కలెక్టర్ స్పష్టం చేశారు. సోమవారం వినతులు స్వీకరించిన అనంతరం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వినతులకు ప్రభుత్వం ఎంత ప్రాధాన్యతనిస్తుందో అధికారులు గుర్తించాలన్నారు. వినతులకు సరైన, నాణ్యమైన సమాధానాలు రాయాలని, సమాధానం పంపే ముందు అర్జీదారుతో మాట్లాడాలని, అర్జీదారు సంతృప్తి చెందినట్లు సమాధానం ఉండాలని తెలిపారు. పని జరిగిన తర్వాతనే అర్జీని డిస్పోజ్ చేయాలని, తప్పుడు ఎండార్స్‌మెంట్ వేసినా, తప్పుడు ఫోన్ నెంబర్లు ఇచ్చినా, సంబంధం లేని సమాధానాలు ఇచ్చినా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అంతకుముందు జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ రీ ఓపెన్ కేసుల విషయంలో రీ ఓపెన్ అవడానికి కారణాలు రాయాలని తెలిపారు. జిల్లాలో పలు ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి 149 అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్‌ఓ మొగలి వెంకటేశ్వర్లు, వార్డు సచివాలయాల అధికారి వై.దోసి రెడ్డి పాల్గొన్నారు.

ఫిర్యాదులు

10 రోజుల నుంచి అంధకారంలోనే..



కాళ్ల మండలం లంక రోడ్డులో చాలా ఏళ్లుగా ఉంటున్న వారిని ఎలాంటి ఇబ్బందులు లేకపోయినప్పటికీ అక్కడి నుంచి తొలగించాలని కుట్రలు చేస్తున్నారు. అక్కడ ఉన్న ఇళ్లకు అధికారులు విద్యుత్ సరఫరా నిలుపుదల చేశారు. దాంతో గత 10 రోజులు అంధకారంలోనే ఉంటున్నాం. ఇళ్ల స్థలాలు లేని వారు సైతం అక్కడి నుంచి పంపించే కుట్ర చేస్తున్నారు.

కాళ్ల లంక రోడ్డు బాధితులు

ఆక్రమణలు తొలగించడం లేదు



నర్సాపురం మండలం కొప్పర్రు గ్రామంలో భీమవరం –నర్సాపురం రోడ్డును ఆక్రమించుకుని 70 మంది భవనాలు నిర్మించారు. దాని వల్ల ట్రాఫిక్ జాం, ప్రమాదాలు జరుగుతున్నాయని గతంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాం. కోర్టులో పిటిషన్ వేసి తొలగింపులకు ఆర్డర్ తీసుకున్నారు. దీనిపై కలెక్టర్ స్పందించి ఆక్రమణల తొలగింపు టీం ఏర్పాటు చేయగా 17 మందికి చెందిన ఆక్రమణలు తొలగించారు. మిగిలిన ఆక్రమణలు తొలగింకుండా కాలయాపన చేస్తున్నారు.

టి.కృష్ణ, కొప్పర్రు

ముసునూరులో పిచ్చికుక్క స్వైర విహారం

14 మందికి తీవ్ర గాయాలు

ముసునూరు: మండల కేంద్రం ముసునూరులో పిచ్చి కుక్క పలువురిని గాయపర్చడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. సోమవారం వలసపల్లి వైపు నుంచి ముసునూరు హరిజన వాడలోనికి ప్రవేశించిన పిచ్చి కుక్క పలువురిని కరిచింది. అక్కడి నుంచి ఊరి మధ్యలోకి ప్రవేశించి మరికొందరిపై తీవ్రంగా దాడి చేసి కరవడంతో 14 మంది కుక్కకాటుకు గురయ్యారు. గాయపడిన వారిలో పిల్లలు, పెద్దలు ఉన్నారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారిణి షకీనా ఇవాంజిలిన్ బాధితులకు ప్రథమ చికిత్స చేసి, రేబిస్ వ్యాక్సిన్ వేశారు. తీవ్రంగా గాయపడిన ఆశా వర్కర్‌ను విజయవాడకు రిఫర్ చేశారు. మిగిలిన వారిని నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పిచ్చికుక్క దాడితో ప్రజలు ఇళ్లలోనుంచి బయటకు రావడానికి భయపడ్డారు. సాయంత్రానికి స్థానిక యువకులు కొందరు ధైర్యం చేసి, పిచ్చి కుక్కను వెంబడించి, కర్రలతో కొట్టి చంపడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.



ముసునూరులో పిచ్చి కుక్క కాటుకు గురైన బాధితురాలు



ముసునూరు పీహెచ్‌సీలో బాధితులకు చికిత్స

జూడోలో గురుకుల విద్యార్థుల ప్రతిభ

పెదపాడు: రాష్ట్ర స్థాయి ఆటల పోటీల్లో వట్లూరులోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఇటీవల నాగార్జున యూనివర్సిటీలో నిర్వహించిన జూడో టోర్నమెంట్‌లో రజతంతో పాటు 7 పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ దాసరి మేరీ ఝాన్సీరాణి తెలిపారు. 70 కేజీల విభాగంలో టీ దివ్యతేజ రాష్ట్ర స్థాయిలో రెండో స్థానం సాధించింది. జూనియర్ విభాగంలో మనోహరిణి, ప్రవల్లిక సబ్ జూనియర్స్ విభాగంలో కే దయ, లక్ష్మి, కావ్య రాష్ట్ర స్థాయిలో మూడో స్థానంలో నిలిచారు.



విజేతలైన విద్యార్థులతో పాఠశాల సిబ్బంది

వైభవంగా శ్రీవారి తిరువీధి సేవ

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ప్రతిరోజు చినవెంకన్న ఉభయ దేవేరులు, గోదాదేవితో కలిసి క్షేత్ర వీధుల్లో అట్టహాసంగా ఊరేగుతున్నారు. ఈ క్రమంలో సోమవారం నిర్వహించిన స్వామివారి తిరువీధి సేవ భక్తులకు నేత్ర పర్వమైంది. తొలుత ఆలయంలో శ్రీవారు, అమ్మవార్లు, గోదాదేవి ఉత్సవ మూర్తులను తొళక్క వాహనంపై ఉంచి, అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా స్వామివారి వాహనం క్షేత్ర వీధులకు పయనమైంది. అర్చకులు, పండితుల వేద మంత్రోచ్చరణలు, మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, గజ, అశ్వ సేవల నడుమ గ్రామోత్సవం జరిగింది. అనంతరం స్థానిక ధనుర్మాస మండపంలో శ్రీవారు, అమ్మవార్లకు అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు.



ఉభయ దేవేరులు, గోదాదేవితో క్షేత్ర వీధుల్లో ఊరేగుతున్న శ్రీవారు

క్లుప్తంగా

డయల్ యువర్ డీఎంకు విశేష స్పందన


మాట్లాడుతున్న గిరిధర్‌కుమార్

తణుకు అర్బన్: డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి విశేష స్పందన వచ్చినట్లు తణుకు ఆర్టీసీ డిపో మేనేజర్ సప్పా గిరిధర్ కుమార్ తెలిపారు. తణుకు, వేల్పూరు, పైడిపర్రు, సజ్జాపురం, తాటిపర్రు నుంచి ప్రయాణికులు ఫోన్ ద్వారా సమస్యలు వివరించారని అన్నీ పరిశీలించి సాధ్యమైనవి పరిష్కరిస్తామని చెప్పారు. బస్టాండ్ ప్రాంతంలో ఆర్వోబీ మెట్లు శుభ్రత, విద్యుత్ దీపాల సమస్యలను ప్రయాణికులు తమ దృష్టికి తీసుకువచ్చినట్లు వివరించారు. భీమవరం వెళ్లే బస్సులకు సంబంధించి డ్రైవర్‌లకు వేల్పూరు ప్రాంతంలో నెమ్మదిగా వెళ్లేలా కౌన్సెలింగ్ ఇస్తామని, మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తామని చెప్పారు.

ఎమ్మెల్సీ వంక సంతాపం


తణుకులో నాగు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ రవీంద్రనాథ్

తణుకు అర్బన్: లయన్స్ క్లబ్ నాయకుడు పాలమూరు నాగభూషణం (నాగు) అకాల మరణం తణుకు లయన్స్ క్లబ్‌కు తీరని లోటని ఎమ్మెల్సీ, లయన్స్ క్లబ్ పూర్వ జిల్లా గవర్నర్ వంక రవీంద్ర నాథ్ అన్నారు. సోమవారం ఇటీవల మరణించిన నాగు కుటుంబ సభ్యులను పరామర్శించారు. లయన్స్ సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని తణుకు చుట్టుపక్కల గ్రామాల్లోని ప్రజలకు గత రెండు దశాబ్దాలుగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. భార్య విజయశ్రీతోపాటు కుటుంబ సభ్యులైన రవీంద్ర, ఐటిఐ అధినేత బసవ రామకృష్ణ, మాజీ కౌన్సిలర్ బసవ శ్రీదేవిలకు ప్రగాడ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాతం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న ఫసల్ బీమా యోజన గడువు


పి.మురళీకృష్ణ

తాడేపల్లిగూడెం రూరల్: ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకానికి దరఖాస్తు సమయం మంగళవారంతో ముగుస్తుందని వ్యవసాయ సహాయ సంచాలకులు పి.మురళీకృష్ణ తెలిపారు. సోమవారం సాయంత్రం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎకరానికి రూ.615లు చెల్లించి బీమా చేయించుకోవాలన్నారు. రూ.41వేలవరకు బీమా వర్తిస్తుందన్నారు. బ్యాంకుల్లో రుణాలు పొందని రైతులు రైతు సేవా కేంద్రాలు, కామన్ సర్వీస సెంటర్ల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. తాడేపల్లిగూడెంలో 50మంది, పెంటపాడు మండలంలో 150 మంది రైతులు మాత్రమే నమోదు చేసుకున్నారన్నారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

చిట్టడవుల్లా ఖాళీ స్థలాలు

- దోమలు, విష పురుగులకు ఆవాసంగా మారిన వైనం
- ఇబ్బందులు పడుతున్నామంటున్న స్థానిక నివాసితులు


తణుకు గుఱజాడ స్కూలు ప్రాంతంలో చిట్టడివిలా ఉన్న ఖాళీస్థలం

తణుకు అర్బన్: మునిసిపాలిటీ పరిధిలో ఉన్న ప్రైవేటు ఖాళీ స్థలాలు చిట్టడవులను తలపిస్తున్నాయి. పిచ్చి మొక్కలు ఏపుగా ఎదిగిపోయి విషజంతువులకు ఆవాసంగా మారాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా పల్లంగా ఉన్న ఖాళీ స్థలాల్లో మురుగునీరు నిల్వ ఉండి దుర్గంధానికి నిలయంగా మారాయి. పాలకులు, అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోవడంలేదని స్థానిక నివాసితులు వాపోతున్నారు. ఈ ఖాళీ స్థలాల పక్కనే ఉన్న భవనాల్లోకి సైతం విషసర్పాలు గోడలపైనుంచి పాకుతూ ప్రవేశిస్తున్నాయని వారు ఆరోపిస్తున్నారు. రహదారులపై సైతం విష సర్పాలు ప్రయాణం చేస్తూ ఖాళీస్థలాల్లోకి చేరుతున్నాయని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

దోమలకు ఆవాసంగా...

పట్టణంలో ఖాళీ స్థలాల యజమానుల నిర్లక్ష్యం కారణంగా ఆయా ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు గుబురుగా పెరిగిపోయి, మురికినీటితో నిండి ఉండడంతో దోమలకు ఆవాసంగా మారాయి. పగలు రాత్రి తేడా లేకుండా దోమలు బాధిస్తున్నాయని ఈ ఖాళీ స్థలాల చెంత ఉన్న నివాసితులు ఆందోళన చెందుతున్నారు. జ్వరాల కేసులు నమోదవుతుండడంతో ఈ దోమలు కుట్టిన కారణంగా ఏ జ్వరాలు సోకుతాయోనని స్థానికులు వాపోతున్నారు. చిన్నారులను దోమల బారి నుంచి ఏ రకంగా రక్షించుకోవాలో తెలియని పరిస్థితి నెలకొందని చెబుతున్నారు. ముఖ్యంగా తణుకులోని బ్యాంకు కాలనీ, ఆంధ్రాసుగర్స్ లే అవుట్, సజ్జాపురం, హౌసింగ్ బోర్డు కాలనీ, పాతవూరు, ఇరగవరం కాలనీల్లో ఈ సమస్యల అధికంగా ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

అడవుల్లా మారాయి



తణుకు మునిసిపాలిటీ పరిధిలోఉన్న ప్రైవేటు ఖాళీ స్థలాలు అడవుల్లామారాయి. స్థలాల యాజమాన్యాల నిర్లక్ష్యం కారణంగా మొక్కలు వృక్షాల్లా మారిపోయాయి. విష జంతువులు, దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు సమస్యను పరిష్కరించాలి.

– షేక్ అబ్దుల్ ఖాదర్ జిలానీ, తణుకు


తణుకు బ్యాంకు కాలనీ పార్కు ప్రాంతంలో చిట్టడవిని తలపిస్తున్న ఖాళీ స్థలం


తణుకు ఆంధ్రసుగర్స్ లేఅవుట్ ప్రాంతంలో పెరిగిన పిచ్చి మొక్కలు

విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికితీసేందుకే సైన్స్ ప్రదర్శనలు

డీవైఈవో మురళి సత్యనారాయణ


సైన్స్ ప్రదర్శనలను తిలకిస్తున్న డీవైఈవో మురళి సత్యనారాయణ


పైడిపర్రు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులు రూపొందించిన సైన్స్ ప్రదర్శన

తణుకు అర్బన్: విద్యార్థుల్లో ఉన్న సైన్స్ నైపుణ్యాన్ని వెలికితీసేందుకు సైన్స్ ప్రదర్శనలు ఉపయోగపడతాయని డీవైఈవో డి.మురళి సత్యనారాయణ అన్నారు. తణుకు ఏకేటీపీ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సోమవారం నిర్వహించిన సైన్స్ ఫెయిర్ వైజ్ఞానిక ప్రదర్శనను ఆయన ప్రారంభించి మాట్లాడారు. సైన్స్ సంపదను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన 50 సైన్స్ ప్రదర్శనలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అత్యుత్తమ ప్రదర్శనలు రూపొందించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. హెచ్ఎం తాళ్లబత్తుల రామకృష్ణ, ఉపాధ్యాయులు మంగతాయారు. పి.శ్రీదేవి, రజియా, ఇ.సునీత, పి.విజయలక్ష్మి, వీవీఎల్ఆర్కే కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

పైడిపర్రు హైస్కూల్‌లో...

నేటి ఆధునిక ప్రపంచంలో సైన్స్‌లేని జీవితాన్ని ఊహించలేమని, జీవన విధానంలో సైన్స్ పాత్ర కీలకమని పైడిపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎ.ఏడుకొండలు అన్నారు. పాఠశాలలో సోమవారం పాఠశాల స్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్‌రంగం ప్రపంచాన్ని శాసిస్తుందని అన్నారు. విద్యార్థులు రూపొందించిన 46 సైన్స్ ప్రదర్శనలు ఆలోచింపచేసేలా ఉన్నాయని అత్యుత్తమ ప్రదర్శనలను మండలస్థాయికి ఎంపిక చేస్తామని చెప్పారు. సైన్స్ ఉపాధ్యాయులు మూర్తి రామకృష్ణ విద్యార్థులకు గైడ్ టీచర్‌గా ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఏసుకృప, జయరాజు, రామలక్ష్మి ప్రసాద్, స్వరూపరాణి, ధనలక్ష్మి విజయకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

4న మండల సర్వసభ్య సమావేశం

పెంటపాడు: పెంటపాడు మండల సర్వసభ్య సమావేశం జనవరి 4న జరుగుతుందని ఎంపీడీవో సీహెచ్ బాలాజీ వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ దాసరి హైమావతి అధ్యక్షతన ఆరోజు ఉదయం 11 గంటలకు నిర్వహించబోయే ఈ సమావేశానికి ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ముఖ్యఅతిధిగా పాల్గొంటారని ఎంపీడీవో తెలిపారు. అన్ని శాఖల ఉన్నతాధికారులు తప్పక హజరు కావాలని ఆయన కోరారు.

నేటి నుంచి పుంతలో ముసలమ్మ ఉత్సవాలు


పూజలందుకొంటున్న పుంతలో ముసలమ్మ అమ్మవారు

పెంటపాడు: మండలంలోని దర్శిపర్రు గ్రామ దేవత పుంతలో ముసలమ్మ అమ్మవారి ఉత్సవాలు జనవరి 1 నుంచి 5 రోజులపాటు వైభవంగా జరగనున్నాయి. ఈ సందర్భంగా ఇప్పటికే ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఏర్పాట్లు పూర్తి చేశారు. గత 50 ఏళ్ల నుంచి ఇక్కడ ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. జనవరి 1న అమ్మవారికి గ్రామోత్సవం, అదే రోజు అమ్మవారి దర్శనాలు, రెండో రోజు మొక్కుబడుల చెల్లింపు, సారె, పసుపు, కుంకుమలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

విజయలక్ష్మికి బెస్ట్ ఉమన్ ప్రెసిడెంట్ అవార్డు



బెస్ట్ ఉమన్ ప్రెసిడెంట్ అవార్డు అందుకున్న వనచర్ల విజయలక్ష్మి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆరోగ్యవంతమైన సమాజం కోసం కృషి చేస్తున్న ఎయిర్‌స్ట్రిప్ మహిళా వాకర్స్ 2024లో చేసిన సేవలకు గుర్తింపుగా పట్టణానికి చెందిన మహిళా వాకర్స్ అధ్యక్షురాలు వనచర్ల విజయలక్ష్మికి బెస్ట్ ఉమన్ ప్రెసిడెంట్ అవార్డు లభించింది. జ్ఞాపిక, రూ. 5 వేలు నగదు పురస్కారం లభించింది. ఇటీవల ఏలూరులో వాకర్స్ ఇంటర్నేషనల్ అవార్డుల ప్రధానోత్సవంలో ఈ అవార్డును విజయలక్ష్మి అందుకున్నారు. ఇంటర్నేషనల్ అధ్యక్షుడు వి.మురళీమోహన్‌రావు హాజరైయారు. విజయలక్ష్మిని సోమవారం పట్టణంలో పలువురు వాకర్స్ సభ్యులు అభినందించారు.

ఉపవాసం ద్వారానే ఆధ్యాత్మిక శక్తి


సమావేశంలో మాట్లాడుతున్న సేవకులు ప్రైజీ, ప్రవీణ్‌లు

పెంటపాడు: ఉపవాస శక్తితోనే దేవుని ఆధ్యాత్మిక శక్తి లభిస్తుందని ఇమ్మానియేలు ప్రేయర్ ఫెలోషిప్ (ఈపీఎఫ్) దేవసేవకులు పి. మోజస్ ప్రవీణ్, ప్రైజీలు పేర్కొన్నారు. తణుకు ఇమ్మానియేలు ప్రార్థనా మందిరంలో సంవత్సరాంత ఉపవాస ప్రార్థనా సభలు సోమవారం నాటికి రెండో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా సోమవారం వారు మాట్లాడుతూ ఇమ్మానియేలు ప్రార్థనా మందిరం ద్వారా జరిగే ఈ ఆధ్యాత్మిక ఉపవాస సంవత్సరాంత సభలలో తప్పక పాల్గొవాలన్నారు. సంవత్సరం అంతా దేవుని కృపలో కాపాడిన దేవునికి ప్రతి ఒక్కరూ విధేయులై ఉండాలన్నారు. డిసెంబర్ 31 రాత్రి వరకు ఈ సమవేశాలు జరుగుతాయన్నారు. వీటిని విశ్వాసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు


ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులు తనిఖీ చేస్తున్న జిల్లా మలేరియా అధికారి రాజ్‌కుమార్

పెంటపాడు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ గులాబ్‌రాజ్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం పెంటపాడు, ముదునూరు ఆరోగ్య కేంద్రాలను పరిశీలించారు. ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. వైద్యాధికారులు తోట రాజేష్, పూజితల ఆధ్వర్యంలో నిర్వహించారు. జాతీయ ఆరోగ్యరక్ష కార్యక్రమంలో భాగంగా సిబ్బందికి ఇచ్చిన లక్ష్యాలను పూర్తిస్థాయిలో నెరవేర్చాలన్నారు. రోగులకు మెరుగైన సేవలను అందించి, అంకితభావంతో పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా ఆయా పీహెచ్‌సీలో ల్యాబ్‌లు, రికార్డులను పరిశీలించారు. ఆరోగ్య విస్తరణాధికారులు సీహెచ్ సత్యనారాయణ, పర్యవేక్షకులు సత్యనారాయణ, ల్యాబ్ టెక్నీషియన్ రాజు, తేజోనాథ్, ఆరోగ్య కార్యకర్తలు, ఏఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతోనే సమానత్వం సాధ్యం

తాడేపల్లిగూడెం రూరల్: విద్య ద్వారానే సమానత్వం సాధ్యమని ఈవోపీఆర్డీ ఎం.వెంకటేష్ అన్నారు. సోమవారం మండలంలోని చిన తాడేపల్లి ఎస్సీ కమ్యూనిటీ హాలులో సివిల్ రైట్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్డీ వెంకటేష్ మాట్లాడుతూ గ్రామంలోని సమస్యలను ప్రజలు సచివాలయంలో తెలియజేస్తే వాటి పరిష్కారించడం జరుగుతుందన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. బాలికలను ఉన్నత చదువులు చదివించాలని సూచించారు. ఏఎస్సై దుర్గారావు, పంచాయతీ కార్యదర్శి బిరుదుకోట రమేష్, వీఆర్వో ఏబీఆర్ కే.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఏఐఎస్ఏ జిల్లా కార్యదర్శి అప్పలస్వామి

తణుకు అర్బన్: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) జిల్లా కార్యదర్శి టి అప్పలస్వామి డిమాండ్ చేశారు. సోమవారం తణుకు ఎస్ఎన్‌వీటీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏఐఎస్ఏ ముఖ్య కార్యకర్తల సమావేశం డి ప్రకాష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పలస్వామి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర వ్యాప్తంగా బకాయిలు దాదాపుగా రూ. 3500 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని వెంటనే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బకాయిలు విడుదల చేయకపోవడంతో కోర్సులు పూర్తయినప్పటికీ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్స్ ఇవ్వడం లేదని, కొన్ని కళాశాలలు ఈ బకాయిలు చెల్లించని పక్షంలో విద్యార్థులను పరీక్షలకు అనుమతించడం లేదని అన్నారు. బకాయిలు విడుదల చేయని పక్షంలో రాబోయే రోజుల్లో విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ ప్రకారం రాష్ట్రవ్యాప్త ఆందోళనలకు సిద్ధమవుతామని ప్రకటించారు. అనంతరం ఈ సమావేశంలో తణుకు నియోజవర్గ అధ్యక్షుడిగా గంటా పవన్‌ను, కళాశాల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎల్ హర్ష, సీహెచ్ జ్యోతిక, కే. దివ్య, బి సాయిమారుతి తదితరులు పాల్గొన్నారు

అమిత్ షా రాజీనామా చేయాలి


తణుకులో నిరసన తెలుపుతున్న సీపీఐ, సీపీఎం నాయకులు


ఇరగవరంలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

తణుకు అర్బన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై రాజ్యసభలో అవమానకరంగా, అప్రతిష్టకరమైన వ్యాఖ్యలు చేసిన హోంమంత్రి అమిత్‌షా తక్షణమే రాజీనామా చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్, సీపీఐ పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక నరేంద్ర సెంటర్‌లో సీపీఐ, సీపీఎం ఇతర సామాజిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్‌షాను మంత్రి మండలి నుంచి తొలగించాలని, దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలన్నారు. అనంతరం డౌన్ డౌన్ అమిత్‌షా అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పులపర్తి సత్యనారాయణ, బండి సత్యనారాయణ, పుట్ట ఆమ్మిరాజు, గార రంగారావు, ఉందుర్తి ప్రసన్న, ఆనందం వెంకటేశ్వరరావు, కామన మునిస్వామి, డేగల హనుమంతురావు, గుబ్బల గోపి, వల్లూరి వెంకటేశ్వరరావు, బళ్ళ చినవీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షా వెంటనే రాజీనామ చేయాలి

ఇరగవరం: కేంద్ర మంత్రి అమిత్ షా వెంటనే రాజీనామ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కామన స్వామి డిమాండ్ చేశారు. వామపక్షాల పిలుపు మేరకు సోమవారం ఇరగవరం మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సామరపల్లి ముసలయ్య, జుత్తిగ రామాంజనేయులు, గుబ్బల ముత్యాలరావు, జక్కంశెట్టి గంగాధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో నిరసన

తాడేపల్లిగూడెం (టీఓసీ): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమాన పరిచిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని సీపీఎం నాయకులు చింతకాయల బాబూరావు డిమాండ్ చేశారు. వామపక్షాల పిలుపులో భాగంగా సోమవారం స్థానిక పోలీస్ ఐలాండ్ వద్ద ధర్నా నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్‌ను అవమానపరిచిన అమిత్‌షా రాజీనామా చేయాలని, కేంద్ర ప్రభుత్వం అమిత్ షాను బర్తరఫ్ చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, సీపీఐ పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరరావులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పట్టణ కార్యదర్శి మామిడి దాన వర ప్రసాద్, కుల నిర్మూలన సమితి నాయకులు మెరిపే జాన్‌రాజు, దాస్యం రాము, జవ్వాది శ్రీను, గొన్నాబత్తుల నాగేశ్వరరావు, మెట్రెడ్డి రమణ తదిరతులు పాల్గొన్నారు.

తణుకులో న్యాయవాదుల నిరసన

తణుకు అర్బన్: న్యాయవాది మృతికి కారకుడైన అనంతపూర్ త్రీటౌన్ సీఐ శాంతిలాల్‌ను అరెస్టు చేయాలని తణుకు బార్ అసోసియేషన్ న్యాయవాదులు డిమాండ్ చేశారు. సోమవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులను బహిష్కరించి న్యాయవాది శేషాద్రి మృతికి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూరంపూడి కామేష్ మాట్లాడుతూ అనంతపురం త్రీటౌన్ పోలీస్ స్టేషన్ సీఐ శాంతి లాల్ సివిల్ కేసులో న్యాయవాది బీవీ శేషాద్రిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించి అవమానకరంగా మాట్లాడి మనసును గాయపరిచి అతనిపై దౌర్జన్యం చేశారన్నారు. అవమానాన్ని భరించలేక న్యాయవాది చనిపోయాడని తెలిపారు. పోలీస్ స్టేషన్‌లలో సివిల్ కేసులు విచారణ చేయరాదని న్యాయస్థానాలు అనేక కేసుల్లో తీర్పులు చెప్పినా పోలీసులు చట్టాన్ని అతిక్రమించి ప్రజల్ని సివిల్ కేసుల పేరుతో వేధించటం సరికాదని అన్నారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోను న్యాయవాదులపై అనేక దాడులు జరుగుతున్నాయని తక్షణమే న్యాయవాదుల రక్షణకు ప్రభుత్వం సమగ్రమైన చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కొరు వెంకటేశ్వర్లు, కలిదిండి పద్మావతి, బి.విక్టర్‌బాబు, చోగే గోపీకృష్ణ, న్యాయవాది గుమస్తాల సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.వెంకటేశ్వరరావు, ఆర్.సురేష్ బాబు, కామన మునిస్వామి పాల్గొన్నారు.

పురుషులకు స్వయం సంఘాలు

తాడేపల్లిగూడెం: పురుషులకు స్వయం సంఘాలు ఏర్పాటు చేయనున్నామని మునిసిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు, మెప్మా సిటీ మిషన్ ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాసు సోమవారం తెలిపారు. ఎంపిక చేసిన వివిధ వృత్తులలో నైపుణ్యం కలిగిన వారిలో ఈ గ్రూపులను ఏర్పాటు చేస్తామన్నారు. స్వయం సహాయక సంఘాలలో ఉన్న మహిళల భర్తలు, వారి పిల్లల్లో ఉన్న నైపుణ్యాన్ని గుర్తించి ఉపాధి కల్పించడం ఈ గ్రూపుల ఏర్పాటు లక్ష్యమన్నారు. ఎలక్ట్రీషియన్ ,ప్లంబింగ్, గుర్తింపు కలిగిన వృత్తులలో ఉన్న పురుషులను గుర్తించి గ్రూపులు ఏర్పాటు చేస్తారు. వీరిని సర్వీస్ ప్రొవైడర్లుగా తయారు చేసి ఉపాధి కల్పిస్తామన్నారు. అవసరమైన వారికి మెప్మా ద్వారా నైపుణ్య శిక్షణ అందజేస్తామన్నారు. ప్రభుత్వం రూపొందించిన ట్రయాంగిల్ యాప్‌లో వారి వివరాలను నమోదు చేసి, వారికి నిరంతరం పని కల్పిస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఇతర వివరాలకు మెప్మా కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.